మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 2025–27 సంవత్సర నూతన మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణ తెలిపారు. గురువారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 21 సంవత్సరాలు నిండిన ఆసక్తిగల అభ్యర్థుల నుంచి ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రతి దరఖాస్తుదారుడు రూ.3 లక్షల నాన్ రీఫండబుల్ డీడీని దరఖాస్తుకు జత చేసి నాంపల్లిలోని ఎక్సైజ్ భవనంలో అందజేయాలని కోరారు.

సెట్ పరీక్ష ఫీజును తగ్గించాలి

లాలాపేట: స్టేట్ ఎలిజిబులిటి టెస్ట్(టెట్) పరీక్ష ఫీజును తగ్గించాలని ఓయూ ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సెట్ కన్వీనర్ ప్రొ. శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జాతీయ స్థాయిలో నిర్వహించే నెట్(నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్)కు జనరల్ అభ్యర్థులకు రూ. 1100, బీసీ అభ్యర్థులకు రూ. 600, ఎస్సీ, ఎస్టీలకు రూ.320 పరీక్ష ఫీజు రుసుము ఉందన్నారు. కానీ రాష్ట్రస్థాయిలో నిర్వహించే సెట్‌కు పరీక్ష రుసుకు అధికంగా జనరల్ అభ్యర్థులకు రూ. 2000, బీసీలకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000 ఫీజు పెట్టడం వలన బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు భారంగా మారిందన్నారు. అధికారులు అందరికి అందుబాటులో ఉండేలా పరీక్ష రుసుము తగ్గించాలని కోరారు. నెట్, సెట్ పరీక్షల తేదీలు ఒకేసారి కాకుండా వేర్వేరుగా ఉండేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఏబీవీపీ విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

ఆధునిక విధానాలతో ప్రమాణాలు మెరుగు

గాంధీఆస్పత్రి: ఆధునిక విధానాలతో వైద్య విద్యా ప్రమాణాలు ఎంతో మెరుగుపడతాయని పలువురు వైద్యనిపుణులు అన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో 'బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్' అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. అత్యాధునిక వైద్యవిధానాలు, నూతన మెళకువలు, అపారమైన అనుభవం, వృత్తినైపుణ్యంతో తెలంగాణ వైద్యరంగం ఎంతో అభివృద్ధి సాధించిందని, దేశ వ్యాప్తంగా వైద్యవిద్య ప్రమాణాలను మెరుగు పర్చేందుకు కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీబీఎంఈ) సదస్సులు తరుచు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. విజయవంతంగా సదస్సును నిర్వహించిన రీజనల్ సెంటర్ నిర్వాహకులకు అభినందించారు. తెలంగాణ వ్యాప్తంగా ఎనిమిది నెలల్లో సుమారు 300 మందికి శిక్షణ ఇచ్చినట్లు గాంధీ రీజనల్ ట్రైనింగ్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ కిరణ్‌మాదల తెలిపారు. అనంతరం రీజనల్ సెంటర్ పరిధిలోని 25 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల నిర్వాహకులకు సర్టిఫికెట్లు, ప్రశంసపత్రాలు అందించారు.

ఘనంగా టీపీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం సుందరయ్య పార్కు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కడమంచి రాంబాబు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి.ముత్తయ్య, ప్రధాన కార్యదర్శి కె. అంజయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

లాలాపేట: తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్టులు, ఓయూ సైకాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ మెంటల్ హెల్త్ డేను పురస్కరించుకొని ఓయూ ఆర్ట్స్ కళాశాలలో' మానవతా సంక్షోభాల సమయం మానసిక ఆరోగ్యం వాటాదారులను సమన్వయం చేయడం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ కాశీం, పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రాథమిక విద్యా స్థాయి నుంచే మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థుల్లో కలిగే ఆందోళనలకు పరిష్కారాలను చూపించవచ్చునన్నారు. మానసిక ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడానికి దోహదపడుతుందన్నారు.

రైలులో ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ల్యాప్‌టాప్ బ్యాగును గుర్తుతెలియని వ్యక్తి లాక్కోని పారిపోయిన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని విజయనగరానికి చెందిన పూర్ణిమ నాయుడు (24) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కాచిగూడకు రావడానికి విశాఖ – మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. ఖమ్మం రైల్వే స్టేషన్ వద్దకు రాగనే ప్రియాంక నాయుడు తలకింద పెట్టుకున్న ల్యాప్‌టాప్ బ్యాగును దొంగ లాక్కుని పారిపోయాడు. గురువారం ఆమె కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఖమ్మం రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఏ ఓటరు ఎటువైపో..?

● ప్రసన్నం చేసుకునేందుకు పార్టీల ప్రణాళికలు ● ఏ ఓటర్లు ఎంతమంది ఉన్నారో లెక్కలు తీస్తున్న అభ్యర్థులు ● బీసీ, మైనార్టీ ఓటర్లే కీలకం



పోలింగ్ తేదీ :	నవంబర్ 11
మొత్తం ఓటర్లు :	3,98,982
పురుషులు :	2,07,367
మహిళలు :	1,91, 530

నియోజకవర్గ ముఖ చిత్రం:
పేద, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి.
అల్పాదాయవర్గాలు ఉన్న ప్రాంతాలు:
బోరబండ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, షేక్‌పేట
వెనుకబడిన తరగతులు(బీసీ):
2 లక్షలు (50 శాతం)

ముస్లింలు	96,500 (24 శాతం)
వలస ఓటర్లు	35,000 (8.7 శాతం)
ఎస్సీలు	26,000 (6.5 శాతం)
మున్నూరు కాపులు	21,800 (5.5 శాతం)
కమ్మ	17,000 (4.3 శాతం)
యాదవులు	14,000 (3.5 శాతం)
మాలలు	12,000 (3 శాతం)
క్రిస్టియన్లు	10,000 (2.5 శాతం)

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక వచ్చేనెల 11వ తేదీన జరగనుండగా, ఇప్పటికే రాజకీయం వేడెక్కింది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మూడు పార్టీల మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తుండగా, ఇప్పటికే బీఆర్ఎస్ కమ్మ కులానికి చెందిన అభ్యర్థి మహిళకు సీటు ఇచ్చింది. కాంగ్రెస్ బీసీ అభ్యర్థి యాదవ కులానికి చెందిన నవీన్‌యాదవ్‌ను ఎంపిక చేసింది. బీజేపీ అభ్యర్థి ఇంకా ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలోనే అన్ని పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తులు పైఎత్తులతో ఇప్పటికే ప్రణాళికలు రూపొందించుకున్నాయి. నియోజకవర్గంలో వివిధ కులాలు, మతాలను ఓటు బ్యాంక్‌గా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తమ అభ్యర్థుల ప్రచారం కోసం ఆయా కులాలకు చెందిన అగ్ర నేతలను రంగంలోకి దింపుతున్నాయి. 2024లో జరిగిన తెలంగాణ కుల గణన సర్వేలో వెల్లడైన కులాలు, మతాలకు సంబంధించిన జాబితాతో ఆయా పార్టీలు తమ ప్రచారంలో సరికొత్త ఎత్తుగడలను ఎంచుకుంటున్నాయి. ఇంకా బీజేపీ అభ్యర్థి ఖరారు కాకపోవడంతో ఇప్పటికైతే కాంగ్రెస్ బీసీ అభ్యర్థిని, బీఆర్ఎస్ ఓసీ అభ్యర్థిని రంగంలోకి దింపాయి. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రచారంలో దూకుడుగా దూసుకెళ్తోంది. అభ్యర్థిని ముందే ప్రకటించడంతో ఆ పార్టీ నేతలు ఇప్పటికే కొన్ని సమావేశాలు కూడా నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థిని బుధవారం రాత్రి ప్రకటించినా అంతకుముందు నుంచే ఓసీ, బీసీ, దళిత మంత్రులు నియోజకవర్గంలో ప్రచారాన్ని, అభివృద్ధి పనుల శంకుస్థాపనల విషయంలో ముందుకు తీసుకువెళ్లారు. ఒకవైపు బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ప్రజల్లోకి వెళ్లి తన భర్త చేసిన పనులను చూపిస్తుండగా, కాంగ్రెస్ తానేమీ తీసిపోనట్లు గల్లీగల్లీలో శంకుస్థాపనలు పూర్తి చేసింది. కాంగ్రెస్ బీసీ అభ్యర్థిని నిలబెట్టడంతో నియోజకవర్గ బీసీ ఓటర్లు ఎంతవరకు ఆ పార్టీ వైపు మొగ్గు చూపుతారో చూడాల్సి ఉంది. ఓటర్లలో సగం మంది బీసీ ఓటర్లు ఉండటం ఈ ఎన్నికల్లో గెలుపోటములు అభ్యర్థులపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. బీజేపీ ఎవరిని నిలబెడుతుందో మిగతా రెండు పార్టీలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఒకట్రెండు రోజుల్లో ఆ పార్టీ కూడా అభ్యర్థిని నిలబెట్టే అవకాశాలు ఉన్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

దీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్



కాచిగూడ: బీసీల రిజర్వేషన్ జీఓ 9 స్థానిక ఎన్నికలను నిలుపుదల చేస్తూ హైకోర్టు స్టే ఇవ్వటానికి నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే తన పదవికి రాజీనామా చేసి బీసీ సమాజానికి కాంగ్రెస్ పార్టీ బహిరంగ క్షమాపణలు చెప్పాలని జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి (ఎన్‌డీఎస్‌ఎఫ్) చైర్మన్, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. గురువారం కృష్ణస్వరూప్ అధ్యక్షతన ఎన్‌డీఎస్‌ఎఫ్ ప్రతినిధుల సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నం.9కు రాజ్యాంగబద్ధత లేదన్నారు. ఇది కోర్టు ఇచ్చిన స్టే ద్వారా తేలిపోయిందన్నారు.

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మోసం చేస్తున్నాయి...

◆ బీసీల ఓట్లతో స్థానిక ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందుతామని మాత్రమే హడావిడిగా జీఓ తెచ్చి ఎన్నికలను తీసుకొచ్చారని ఆరోపించారు. బీసీల ఆత్మగౌరవం మీద రాష్ట్ర ప్రభుత్వం రాజకీయం చేసి కోర్టుల్లో వీగిపోయేలా చేసిన మంత్రుల కుటిల బుద్ధి బయటపడిందని విమర్శించారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని చేర్చితేనే బీసీలకు రక్షణ ఉంటుందన్నారు. బీసీలను మోసం చేయడంలో కాంగ్రెస్‌తో పాటు, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఏకమై బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా కుట్రలు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.అశోక్, ఇండియన్ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట రాజేశ్వరరావు, బయ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వీరన్న నాయుడు, మాల మహానాడు అధ్యక్షుడు జేఎస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీఓ నం.9ను అడ్డుకునే కుట్ర జరుగుతోంది

దుండ్ర కుమారస్వామి



కాచిగూడ: హక్కుల సాధన కోసం బీసీలు ఐక్యంగా పోరాడాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి పిలుపునిచ్చారు. గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, బీజేపీ మత్స్యకారుల విభాగం రాష్ట్ర కో–కన్వీనర్ రమణ ముదిరాజ్, బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ మురళీకృష్ణ లతో కలిసి దుండ్ర కుమారస్వామి మాట్లాడారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నం.9పై హైకోర్టు మధ్యంతర స్టే విధించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు స్టే విధించడం బీసీ సమాజానికి తగిలిన పెద్ద దెబ్బ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక కుల గణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీఓ తీసుకొచ్చిందన్నారు. అగ్రకులాలకు చెందిన కొందరి రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా జీఓ నం.9ను అడ్డుకునే కుట్ర జరిగిందన్నారు. ఈ విషయంలో అవసరమైతే సుప్రీంకోర్టు వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. అంబేడ్కర్ ఇచ్చిన ఓటుతోనే ఇలాంటి కుట్రలకు సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు. న్యాయ పోరాటంతో పాటు ప్రజాపోరాటం కూడా ప్రారంభిస్తామని తెలిపారు. బీసీల ఐక్యతతోనే బీసీల రిజర్వేషన్లను సాధించుకుంటామని అన్నారు.

'అన్ని పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయి'

ముషీరాబాద్: 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేను నిరసిస్తూ గురువారం విద్యానగర్ చౌరస్తాలో రిజర్వేషన్ వ్యతిరేక దిష్టిబొమ్మను బీసీ సంఘాలు దహనం చేశాయి. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎర్ర సత్యనారాయణ మాట్లాడారు. 79 ఏళ్లుగా అన్ని పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని ఢిల్లీలో తిష్టవేసి బీసీ 42శాతం రిజర్వేషన్లను కల్పించే విధంగా సుప్రీంకోర్టుకు వెళ్లి అమలయ్యే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందగోపాల్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వంశీకృష్ణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.



విద్యానగర్ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

దేశంలో దళితులపై దాడులు ఆందోళనకరం

విశ్రాంత ఐపీఎస్ అధికారి డా.కె.బాబురావు



హిమాయత్‌నగర్: దళితులు, మైనార్టీలు, క్రిస్టియన్లపై దాడులు పెరిగిపోతున్నాయని విశ్రాంత ఐపీఎస్ అధికారి, సివిల్ రైట్స్ ఇంటియేటీవ్ ఇంటర్నేషనల్(సీఆర్ఐఐ) జాతీయ అధ్యక్షుడు డా.కె.బాబురావు ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మతోన్మాది రాకేష్ కిషోర్ చేసిన దాడి ప్రజాస్వామ్యానికి, న్యాయ వ్యవస్థకు, రాజ్యాంగానికి గొడ్డలిపెట్టని పేర్కొన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ వివిధ సంఘాలతో సీఆర్ఐఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దళితుడు కాబట్టే గవాయ్‌పై దాడికి పాల్పడ్డాడని, అతడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజేఆర్ నారగోని, సామూహిక సెక్యులర్ రైటర్స్ ఫోరం ప్రతినిధి మేర్సీ మార్గరేట్, కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ సుధీర్, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు బిషప్ సంజయ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణలోనూ బీఎస్పీ రాజ్యం వస్తుంది'



కాన్షీరాంకు నివాళులర్పిస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రం శేఖర్, నేతలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో కూడా బీఎస్పీ రాజ్యం వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రం శేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇబ్రం శేఖర్ మాట్లాడుతూ... కాన్షీరాం ఆశయ సాధనకు బహుజనులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఇప్పుడు జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాడాలి...

◆ బీఎస్పీ జాతీయ కోఆర్డినేటర్ అతార్‌సింగ్ రావు మాట్లాడుతూ... బహుజనులకు రాజ్యాధికారం వచ్చినప్పుడే వారు ఆత్మగౌరవంతో బతుకుతారని చెప్పిన మహనీయుడు కాన్షీరాం అని కొనియాడారు. ఆ దిశగా బహుజనులు ఏకమై రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మూల రాంచరణ్‌దాస్ నాయకులు దొడ్ల శ్రీనివాస్, రాంచరణ్‌దాస్, రవి ముదిరాజ్, గిరి మహారాజ్, బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నల్లకుంట: డివిజన్‌లో చేపట్టే అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని నల్లకుంట కార్పొరేటర్ అమృత జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. నల్లకుంట డివిజన్ పరిధిలోని బ్రాహ్మణ హాస్టల్ లేన్‌లో రెండు నెలల క్రితం శంకుస్థాపన చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. గత నెలలో వినాయక నవరాత్రులు, ఆ తరువాత దుర్గా నవరాత్రి ఉత్సవాలు ఉన్న కారణంగా స్థానికుల విజ్ఞప్తి మేరకు రోడ్డు నిర్మాణ పనులను ఆలస్యంగా చేపట్టినట్టు ఆమె తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానికులు కాంట్రాక్టర్‌కు సహకరించాలని కోరారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సీహెచ్. సాయిమోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత

బీజేపీ వల్లే బీసీలకు అన్యాయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ రిజర్వేషన్లను అడ్డుకోవడం వలనే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ అన్నారు. గురువారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశాయని అన్నారు. రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం కోసం పంపారని తెలిపారు. ఆరు నెలలు అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. అందువల్లే హైకోర్టు స్టే ఇచ్చిందని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇవ్వడానికి రాత్రికి రాత్రే నిర్ణయం తీసుకున్న కేంద్రానికి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. బీసీ ప్రధాని అయిన నరేంద్రమోదీ బీసీలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లకై పెద్ద ఎత్తున్న ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీఆర్‌పీ మద్దతు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు బహుజన్ రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. గురువారం బీఆర్‌పీ రాష్ట్ర కమిటీ బృందం పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి మద్దతు పత్రాన్ని అందజేశారు. మనువాద రాజకీయ పార్టీల ఎత్తుగడలు, మోసాలను తిప్పికొడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడుని కలిసిన వారిలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శులు బుర్రి సాగర్, అంకేశ్వరపు రమేష్, కూరేళ్ల రమేష్, ఉపాధ్యక్షులు ఎడ్ల రవి ముదిరాజ్, పిసరి రజిత పాల్గొన్నారు.



అన్నానగర్‌లో అంధకారం



అన్నానగర్‌లో వీధి దీపాలు వెలగక చిమ్మ చీకట్లు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని అన్నానగర్‌లోని మలయాళం మఠం వీధిలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. అంధకారం అలముకోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్ట్రీట్‌లైట్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు స్పందించారు..



చిక్కడపల్లి: ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ అనే శీర్షికతో 'సాక్షి'దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు, కార్పొరేటర్ స్పందించారు. కార్పొరేటర్ పావని, వాటర్ వార్క్స్ మేనేజర్ కృష్ణమోహన్ పీపుల్స్‌పార్క్ లేన్‌లోని దుర్గా నిలయం వద్దకు చేరుకుని మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

పాత నల్లకుంటలో ముంపు సమస్యను పరిష్కరించండి



డీసీ మారుతీదివాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌సీఏ ప్రతినిధులు

నల్లకుంట: పాత నల్లకుంట స్ట్రీట్ నం.14, 15, 16లలో కొన్నేళ్లుగా తలెత్తుతున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నల్లకుంట సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్(ఎస్‌సీఏ) ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు గురువారం అంబర్‌పేట సర్కిల్–16 డీసీ మారుతీదివాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 50ఏళ్ల క్రితం పాత నల్లకుంటలో నిర్మించిన బాక్స్ నాలా పూర్తిగా శిథిలావస్థకు చేరిందని డీసీకి వివరించారు. దీనికి తోడు నాలాలో పూడిక తీయడం లేదని తెలిపారు. నాగమయ్యకుంట నుంచి వచ్చే వరదనీరు శంకరమఠం రోడ్డులోని రిలయన్స్ మాల్ వద్ద ఉన్న నాలాలో ఐరన్ జాలి ఏర్పాటు చేస్తే వరదలో కొట్టుకు వచ్చే వ్యర్థాలు అక్కడే నిలిచి పోతున్నాయని పేర్కొన్నారు. నాలా పునరుద్ధరణ పనులు చేపడితే ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అందుకు డీసీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పెంచిన బస్ చార్జీలను తగ్గించాలి

● బీఆర్ఎస్ నేతల బస్ భవన్ ముట్టడి ● నిరసనలు తెలిపేందుకు వచ్చిన నేతల అరెస్టు

ముషీరాబాద్: బస్ చార్జీల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ అధిష్టానం ఇచ్చిన పిలుపులో భాగంగా బస్ భవన్ ముట్టడి కార్యక్రమానికి బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ సారథ్యంలో భోలక్‌పూర్, ముషీరాబాద్ నేతలు బస్సులో తరలి వెళ్లారు. బస్ భవన్ ముట్టడికి యత్నించగా పోలీసులు వారిని బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ముఠా జైసింహ మాట్లాడుతూ... బస్ చార్జీలు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం పడుతుందన్నారు. ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే పెంచిన బస్ చార్జీలను తగ్గించాలన్నారు. లేకుంటే తమ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, బింగి నవీన్, శివ ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి...

◆ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అబద్ధంపు హామీలే అని తేలిపోయాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగేష్ ముదిరాజ్ విమర్శించారు. బస్ చార్జీల పెంపును నిరసిస్తూ బస్‌భవన్ వద్ద ఆందోళన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న నాగేష్‌ముదిరాజ్‌ను వారాసిగూడ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అనంతరం నగేష్‌ముదిరాజ్ విలేకరులతో మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారంటీలు అమలులో విఫలమైందన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పి బస్సు చార్జీల పెంచడమేంటని ప్రశ్నించారు. ఆర్టీసీకి రూ.6 వేల కోట్ల అప్పు ఉందన్నారు. దీనిని వెంటనే ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు.

అంబర్‌పేట బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

అంబర్‌పేట: పెరిగిన బస్సు చార్జీలకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను అంబర్‌పేట పోలీసులు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అలాగే పార్టీ కార్పొరేటర్లు, నాయకులను సైతం అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం కొద్ది సేపటికి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బీ.పద్మావెంకట్‌రెడ్డి, నాయకులు బీ.వెంకట్‌రెడ్డి, శ్రీరాములు ముదిరాజ్, రమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.



అంబర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు, నాయకులు



బస్‌భవన్ వద్ద జరిగే ఆందోళనకు ఆర్టీసీ బస్సులో వస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు